కుదరని సిండికేట్-భక్తులే టార్గెట్

- పెనుగంచిప్రోలులో బెడిసికొట్టిన మద్యం సిండికేట్ పన్నాగం
- ఐదు దుకాణాలు పెనుగంచిప్రోలులోనే
- భక్తులే టార్గెట్‌గా సాగుతున్న మద్యం విక్రయాలు



పెనుగంచిప్రోలు పాత సినిమాహాల్ సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మద్యం షాపు హెడ్ నిర్మాణ పనుల్లో కూలీలు



పెనుగంచిప్రోలులో మునేరు అవతల మద్యంషాపు ఏర్పాటు కోసం షెడ్డును రెడీ చేస్తున్న వ్యాపారులు

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు మండలంలో మద్యం దుకాణాల మధ్య సిండికేట్ వ్యవహారం బెడిసికొట్టింది. పెనుగంచిప్రోలు పవిత్ర పుణ్యక్షేత్రానికి నిత్యం వేలాదిగా భక్తులు ఇతర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ భక్తులనే టార్గెట్‌గా చేసుకుని మద్యం వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు.

షాపు కోసం రూ.కోటి వెచ్చించారు

పెనుగంచిప్రోలు మండలానికి ఐదు మద్యం షాపులు కేటాయించగా, డిమాండ్ అధికంగా ఉంటుందనే ఉద్దేశంతో ఈ షాపుల కోసం వ్యాపారులు భారీసంఖ్యలో దరఖాస్తు చేశారు. ఈ ఐదు షాపుల్లో రెండు మాత్రమే స్థానికులకు దక్కగా, మిగిలిన మూడు షాపులు తెలంగాణ వారికి దక్కాయి. గత ప్రభుత్వ హయాంలో మండలానికి ఐదు షాపులు కేటాయించగా, ఇందులో మూడు పెనుగంచిప్రోలులో ఏర్పాటు చేశారు. ఒక మద్యంషాపును అనిగండ్లపాడు, మరో షాపును నవాబుపేటలో ఏర్పాటు చేశారు. ఈసారి తెలంగాణ వారికి దక్కిన మూడు మద్యంషాపులను ఒక్కోటి రూ.86లక్షల నుంచి రూ.కోటి వరకు వెచ్చించి జగ్గయ్యపేట నియోజకవర్గంలోని నాయకులు, వారి అనుచరులు, పెనుగంచిప్రోలు మండలానికి చెందినవారు కొనుగోలు చేశారు. మొత్తం ఐదు దుకాణాలను పెనుగంచిప్రోలులోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించి ఆమేరకు షెడ్ల నిర్మాణాలు చేపట్టారు.

భక్తులను దోచుకోవడమే లక్ష్యం

మద్యం వ్యాపారులు నిత్యం అమ్మవారి ఆలయానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మద్యం ప్రియులను దోచుకునే లక్ష్యంతో సిండికేట్ అయ్యేందుకు సిద్ధమై వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. ఒప్పందంలో భాగంగా మూడు మద్యంషాపులను పెనుగంచిప్రోలులో మిగిలిన రెండుషాపులను గతంలో మాదిరి అనిగండ్లపాడు, నవాబుపేటలో ఏర్పాటు చేయాలని ప్లాన్ చేశారు. పెనుగంచిప్రోలు నుంచి బయటకు వెళ్లే దుకాణదారులకు నెలకి ఒక్కొక్కరికి రూ.7లక్షలు ఇచ్చేలా కూడా ఒప్పందాలు చేసుకున్నారు. అంతేకాకుండా బెల్ట్‌షాపులకు కూడా మద్యాన్ని ఎలా సరఫరా చేయాలనే అనేఅంశంపై కూడా వారంతా ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

వ్యాపారుల మధ్య మాటల తేడాలు

ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వరకు సిండికేట్ అయినట్లుగా నిర్ణయించిన వ్యాపారులు దీంతో పెనుగంచిప్రోలులో మూడు షాపులు మినహా, మిగతా రెండు మద్యంషాపులకు షెడ్ల నిర్మాణపు పనులను నిలుపుదల చేశారు. అయితే రాత్రికి రాత్రి మద్యం వ్యాపారుల మధ్య కుదిరిన సయోధ్య బెడిసికొట్టినట్లు సమాచారం. తెల్లవారే సరికి పాత సినిమాహాల్ సెంటర్‌లో ఆగిన షెడ్ల నిర్మాణం పనులు మళ్లీ మొదలుపెట్టారు. మద్యం వ్యాపారంలో దశాబ్దాలుగా ఉన్నవారికి, లాటరీ ద్వారా కొత్తగా షాపు దక్కించుకుని మద్యం వ్యాపారంలోకి వచ్చిన జూనియర్ల వ్యాపారులకు మధ్య మాటలు తేడారావడంతో మద్యం సిండికేట్ వ్యవహారం నిలిచిపోయినట్లు ఆయావర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. మొత్తమ్మీద శ్రీతిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల జేబులను గుల్ల చేయడమే లక్ష్యంగా మద్యంవ్యాపారులు ఏర్పాటు చేయదలచిన మద్యం సిండికేట్‌కు ప్రస్తుతానికి బ్రేక్‌పడిందని చెప్పవచ్చు.

క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యుల సమావేశం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సభ్యుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న విజ్ఞాన్ హైస్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ దొడ్డా అంజిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పడిగపాటి చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఆత్మీయ సమావేశానికి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల సోషల్ మీడియా కన్వీనర్లు, సోషల్ మీడియా సైనికులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

జగ్గయ్యపేట సీఐగా పోలాకి వెంకటేశ్వర్లు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట సీఐగా పోలాకి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇప్పటివరకు సీఐగా పనిచేసిన జానకీరామ్ విజయవాడ ఎస్‌బీకి బదిలీకాగా, అక్కడ పని చేస్తున్న వెంకటేశ్వర్లు జగ్గయ్యపేటకు బదిలీపై వచ్చి శనివారం ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగ్గయ్యపేటపై అవగాహన ఉందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమర్థవంతంగా విధులు నిర్వహించి శాంతిభద్రతలను కాపాడతానని తెలిపారు. అదేవిధంగా సీఐ వెంకటేశ్వర్లు స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మ గుడిని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు.

మద్యం షాపుల తనిఖీ




జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలోని 10 మద్యం షాపులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మినెంట్ లైసెన్స్ మంజూరు చేయడానికి ఎక్సైజ్ డీఎస్పీ ఆర్‌వీ.రామారావు శనివారం మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం నిబంధనల ప్రకారం గుడి, బడి, హాస్పిటల్ ప్రాంతాలకు దూరంగా మద్యం దుకాణాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట జగ్గయ్యపేట ఎక్సైజ్ సీఐ బి.గురవయ్య ఉన్నారు.

'కోపా' స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): కుల మతాలకు అతీతంగా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందించేందుకు కాపు అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(కోపా) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోపా అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ దావులూరి కైలాసరావు, డి.రమేష్ కుమార్ తెలిపారు. విజయవాడ ముత్యాలంపాడులో శనివారం సాయంత్రం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కోపా గత 27 ఏళ్లుగా ఉమ్మడి కృష్ణా జిల్లాలకు చెందిన మెరిట్ విద్యార్థులను గుర్తించి ఏటా ఉపకార వేతనాలు అందజేసి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. తమ వద్ద ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులే దాతలుగా మారి కోపాకు సహకరించటం సంతోషంగా ఉందన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, మెడిసిన్, డిప్లొమో తదితర కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు kopakrishnavja@gmail.com కు అభ్యర్థన పంపితే దరఖాస్తు పంపిస్తామని చెప్పారు. పూర్తి చేసిన దరఖాస్తులకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జత చేసి వచ్చే నెల 20వ తేదీలోపు పంపించాలని సూ చించారు. మరింత సమాచారం కోసం 94402 39989, 70936 39919 నంబర్లు, ఈ మెయిల్ ఐడీల ద్వారా సంప్రదించాల్సిందిగా వారు కోరారు. సమావేశంలో కోపా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సంజీవ్, కోశాధికారి గా జుల రామారావు, ఎక్స్ అఫీషియో సభ్యులు కొప్పరాతి వెంకట రమణారావు, రామాయణం నాగసత్యం, గల్లా భాస్కర్ రావు, బెల్లం సత్యనారాయణ, పులుగుజ్జు ప్రసాద్, బీవీ సుధాకర్ పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళగిరికి చెందిన శ్రీశైలజ నృత్య కళానిలయానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం వేదికపై శనివారం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నృత్య ప్రదర్శన జరిగింది. చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగ్గయ్యపేట/జగ్గయ్యపేటఅర్బన్: చిల్లకల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగనవాడీ కేంద్రాలలో ఖాళీగా ఉన్న కార్యకర్త, సహాయకురాలి పోస్టులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ లక్ష్మీభార్గవి కోరారు. మండలంలోని పోచంపల్లి-2 కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ-బి), జగ్గయ్యపేట పట్టణంలోని ఒకటోవార్డు మూడోనంబరు అంగన్‌వాడీ కేంద్రంలోని సహాయకురాలు (ఓసీ) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు ఆసక్తిగలవారు స్థానికులై ఉండి వివాహితులై ఉండాలన్నారు. పదోతరగతి పాస్ అయినవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను నవంబర్ 5వతేదీ సాయంత్రం ఐదుగంటల్లోగా అందజేయాలన్నారు. పూర్తివివరాలకు చిల్లకల్లులోని తమ కార్యాలయంలో సంప్రదించాలని సీడీపీఓ సూచించారు.

వీఆర్వోలతో సమావేశం

జుజ్జూరు(వీరులపాడు): వీఆర్వోలు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హుస్సేన్ ఆదేశించారు. జుజ్జూరులోని తన కార్యాలయంలో శనివారం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు ఆయా గ్రామాల్లోని ప్రజల రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. వీఆర్వోల పనితీరుపై ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

అండర్‌పాస్‌లో వరద నీటిని తొలగించరూ..



అండర్‌పాస్ వద్ద నెలరోజులుగా కదలని వరదనీరు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని ధనంబోడు కాలనీ, విద్యానగర్‌కు వెళ్లేమార్గంలో గూడ్స్ రైల్వే లైన్ కింద ఉన్న అండర్ పాస్‌లో నిలిచిఉన్న వరద నీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. గతనెలలో సంభవించిన భారీవర్షాలకు వరద ముంపుతోపాటు, స్థానికంగా అండర్‌పాస్‌లో భూమిలో నుంచి ఊటల ద్వారా వస్తున్న నీరు కలవడంతో పెద్ద మడుగులా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్రఅంతరాయం ఏర్పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధనంబోడు కాలనీ, విద్యానగర్ కాలనీలు జగ్గయ్యపేట పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంగా ఉండటంతో ఎక్కువ మంది ఆటోల్లోనే జగ్గయ్యపేట పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ద్విచక్ర వాహనదారులు కూడా అండర్‌పాస్ గుండా రాకపోకలు సాగిస్తుండటంతో ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. అండర్‌పాస్‌లో నిలిచిఉన్న బురదనీటిలో గుండా ప్రయాణించాలంటే అసౌకర్యంగా ఉంటుందని వాహనదారులు వాపోతున్నారు. ఎదురెదురుగా వాహనాలు రాకపోకలు సాగించేటపుడు వాహనదారుల మీద, నడచివెళ్లే బాటసారుల మీద బురదనీరు పడుతుండటంతో ఇబ్బందిపడుతున్నారు ఇకనైనా మున్సిపల్, రైల్వేఅధికారులు స్పందించి అండర్‌పాస్ వద్ద వరదనీటి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉద్యోగాలకు 25మంది విద్యార్థులు ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అమ్రితసాయి కళాశాల యాజమాన్యం

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన స్కెనిడర్ ఎలక్ట్రికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన ప్రతినిధులు ప్రాంగణ ఎంపికలు చేపట్టారు. ఎంబీఏ, బీటెక్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మౌఖిక పరీక్ష, రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 25మంది విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ మాట్లాడుతూ తమ కళాశాలలో నాణ్యమైన సాంకేతిక విద్యనందించటంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా మెరుగైన విద్యను అందిస్తున్నామన్నారు. అసోసియేట్ ఇంజినీర్లుగా ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ. 2.4లక్షలు లభించనుందని వివరించారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కే రామ్మోహన్‌రావు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నందిగామకు చెందిన తల్లపునేని రాకేష్‌చౌదరి రూ.23,600 విరాళం అందించినట్లు ఆలయ ఏసీ ప్రసాద్‌శనివారం తెలిపారు. అనంతరం దాతకు స్వామి వారి ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన డీసీఎం లారీ

ట్రాక్టర్ డ్రైవర్ మృతి

కంచికచర్ల : రోడ్డు క్రాస్ చేస్తున్న ట్రాక్టర్‌ను, డీసీఎం లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బోనగిరి రాజు కథనం ప్రకారం కంచికచర్ల అరుంధతీనగర్‌కు చెందిన గొర్రెపాటి బసవయ్య అలియాస్ చిన్నబ్బాయి (32) మండలంలోని కీసర ఇసుక రీచ్ నుంచి గొల్లపూడికి ఇసుక తరలించేందుకు ట్రాక్టర్‌పై వెళ్తున్నాడు.పేరకలపాడు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న పంపు వద్దకు వెళ్లి బాటిల్‌కు మంచినీరు పట్టుకున్నాడు. ఆ తర్వాత ట్రాక్టర్‌తో రోడ్డు క్రాస్ చేస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న డీసీఎం లారీ ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ బసవయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న టోల్‌వేస్ అంబులెన్స్ వాహన సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వైద్యచికిత్స కోసం విజయవాడ తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. బసవయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగుతున్న ఈవోపీఆర్డీ, సచివాలయ సిబ్బంది

బలుసుపాడు(జగ్గయ్యపేట): పారిశుద్ధ్య కార్మికులను చిన్నచూపు చూడరాదని ఈవోపీఆర్డీ పద్మావతి అన్నారు. గ్రామంలో కాఫీ విత్ క్లాప్ మిత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జగ్గయ్యపేట మండలంలోని బలుసుపాడు పారిశుద్ధ్య కార్మికులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అధికారులు పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగారు. వారి ఇబ్బందులను అడిగితెలుసుకున్నారు. ఈసందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేస్తూ వెలకట్టలేని సేవలందిస్తున్నారని కొనియాడారు. వారిని చిన్నచూపు చూడకుండా ప్రతిఒక్కరు గౌరవించాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో ఏవో మాధవశర్మ, కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖాధికారి నీలిమ

చందర్లపాడు(నందిగామటౌన్): మిర్చిరైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి నీలిమ సూచించారు. చందర్లపాడు గ్రామంలో జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ గ్రీన్ సంస్థ భాగస్వామ్యంతో మిరప పంటలో తెగుళ్ల, పోషకాలు, నీటి యాజమాన్యం పద్ధతులపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవనశాఖ అధికారి నీలిమ మాట్లాడుతూ రైతులు విధిగా మట్టి పరీక్షలు చేయించి అందుకనుగుణంగా ఎరువులు, పురుగుమందులు వాడాలన్నారు. అంతే కాకుండా మిర్చి పంటలో అధికంగా ఆశించే ఆకుముడత తెగులు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మట్టి పరీక్షలు, పంట సలహాలు, ఫార్మర్ చాట్ యాప్ తదితర విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమరవాణా చేస్తే కఠిన చర్యలు

టాస్క్‌ఫోర్స్ సీఐ మూర్తి హెచ్చరిక



కంచల ఇసుక రీచ్‌ను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి

నందిగామటౌన్: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసేవారిపై కఠినచర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్‌వివిఎస్ మూర్తి హెచ్చరించారు. మండలంలోని కంచల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు విజయవాడ సీపీ ఆదేశాల మేరకు తనిఖీలు చేపడుతున్నామన్నారు. అందులోభాగంగానే కంచల రీచ్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా డ్రోన్‌లను వినియోగించి మునేటి తీరాల వెంబడి నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ఇసుక అక్రమరవాణా సాగించినా, అక్రమ నిల్వలు చేసినా సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్పెషల్ టీం సిబ్బంది గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభకు 42 అర్జీలు

నందిగామ టౌన్: గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న రీసర్వే గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామకార్యదర్శి జానీ, సర్వేయర్ సతీష్ సూచించారు. మండలంలోని రామిరెడ్డిపల్లిలో శనివారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించుకునేందుకు రీసర్వే గ్రామసభల ద్వారా అర్జీలు అందించవచ్చన్నారు. అర్జీలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని వివరించారు. తమ భూసమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు 42 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు అబ్బూరి నాగమణి, గ్రామనాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలకు పదును పెడితేనే విజయావకాశాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమలోని నైపుణ్యాలకు పదును పెడితేనే అద్భుతమైన విజయావకాశాలు లభిస్తాయని హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో హెచ్‌ఆర్ కాంక్లేవ్ పేరుతో అవగాహన సదస్సును శనివారం కాలేజీ ప్రాంగణంలో నిర్వహించారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థుల చదువులు పూర్తవ్వకుండానే ఉపాధి అవకాశాలు పొందుతున్నారన్నారు. మంచి అవకాశాలను పొందడానికి ఇంటర్వ్యూల్లో మరింత రాణించడానికి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కంపెనీలు తమ ఉద్యోగుల నుంచి ఏమి ఆశిస్తాయో తెలుసుకొని అలాంటి ప్రతిభాపాటవాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం వారివారి రంగాల్లో రాణించడానికి కళాశాల పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేష్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ మార్పులను అనుసరించాలి

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్నోమైండ్స్ క్లబ్‌ను శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రొఫెసర్ బీవీ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఎదురయ్యే మార్పులను అనుసరించినప్పుడే అభివృద్ధిని సాధిస్తారని పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, ప్రిన్సిపాల్ పతంజలిశాస్త్రి పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు

- వెబ్ పోర్టల్‌లో ఆప్షన్లు నిలిపివేత
- కార్డుల్లో మార్పులు చేర్పులకు దక్కని అవకాశం
- ఇబ్బందుల్లో ప్రజలు

వత్సవాయి: ప్రభుత్వం నుంచి ఏ పథకం అందుకోవాలన్నా రేషన్‌కార్డు తప్పనిసరి అటువంటి కార్డుల మంజూరుపై కూటమి ప్రభుత్వం ఐదునెలలుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా కొత్త రేషన్‌కార్డుల ఊసే లేదు. దరఖాస్తు చేసుకుంటే అర్హత ఉన్నవారికి అందజేసే ఈ-రైస్‌కార్డును సైతం నిలిపివేవారు. రేషన్‌కార్డులు స్ప్లిట్టింగ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించడం లేదు. ఒకచోట నుంచి మరొకచోటకు మార్చుకునే అవకాశం కూడా లేకుండాపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

వత్సవాయిలో 19వేల కార్డులు...

వత్సవాయి మండలంలో మొత్తం 19వేల రేషన్ కార్డులు ఉన్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటే పరిశీలన అనంతరం వారం తిరిగేలోపే కార్డు లబ్ధిదారుని చేతికివచ్చేది. కార్డు మంజూరు అయిన మరుసటి నెల నుంచే కార్డులోని వారందరికీ ఇంటి దగ్గరకు వచ్చే రేషన్ సరుకులు అందించేవారు. అంతేకాకుండా ఆరోగ్యశ్రీ పథకం ప్రయోజనం, పిల్లల చదువులు, రుణాలు, ఉపకార వేతనాలు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు కూడా ఈ రేషన్ కార్డు ఉపయోగపడేది. దీంతో ఎంతోమంది పేదలు ప్రయోజనం పొందేవారు.



రేషన్‌కార్డు

ఆప్షన్లు నిలిపివేతతో అవస్థలు..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సివిల్ సప్లయ్స్ పోర్టల్‌లో ఉన్న ఆప్షన్లను నిలిపుదల చేశారు. ఈ పోర్టల్ మూసివేయడంతో కార్డుకు సంబంధించిన ఎటువంటి కార్యక్రమాలకు ఆస్కారం లేకుండా పోయింది. ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన నాటినుంచి ఒక్క రేషన్‌కార్డు మంజూరుచేయలేదు. అలాగే కార్డులో కొత్తవారిని యాడింగ్ చేసే అవకాశం కూడా లేకపోవడంతో కొత్తగా వివాహాలు చేసుకున్నవారు, పిల్లలను కార్డులో చేర్చుకునే అవకాశం లేదు. కొత్త కార్డులు మంజూరు, కార్డులో చేరికలు, ఒకచోట నుంయి మరొకచోటుకు మార్చుకునే అవకాశాలు లేకుండా పోయాయి. ఎంతోమంది కొత్తకార్డుల మంజూరు కోసం వేచిచూస్తున్నారు. దీపావళి పండుగ నుంచి కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల్లోని ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ పథకాన్ని అమలుచేస్తామని చెబుతుండటంతో రేషన్‌కార్డు లేకపోతే తామకు ఆ పథకం లభించదని పేదలు చెబుతున్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి కొత్త రేషన్‌కార్డుల మంజూరుతోపాటు ఉన్న కార్డుల్లో యాడింగ్, స్ప్లిట్టింగ్ సదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లల పేర్లు నమోదు చేయడం లేదు

కార్డులో పిల్లల పేర్లు యాడింగ్ చేసేందుకు ఎదురుచూస్తున్నాను. నాకు బియ్యం కార్డు ఉంది. సచివాలయం వద్దకు వెళ్లి యాడింగ్ కోసం అడిగితే ప్రస్తుతం ఆప్షన్ లేదు అని చెబుతున్నారు. పోర్టల్ ఓపెన్ అయితే అప్పుడు వచ్చి పెట్టుకోండి అని చెబుతున్నారు.

–చావా జగన్, మక్కపేట